సాక్షి
ప్రకాశం
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



మేత బీడు కొట్టేశారు

తర్లుపాడు మండలంలో 200 ఎకరాల పశువుల బీడు కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు పన్నాగం పన్నారు. రికార్డుల్లో మేతబీడుగా పేర్కొన్న వివరాలు దిద్ది తమ పేర్లు రాసుకున్నారు. - 12లో..



సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. - 12లో..

గరిష్టం/కనిష్టం
33/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వరద బాధితులకు ఆహార ప్యాకెట్‌లు

- ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



భోజనం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: వరద బాధితులకు సకాలంలో ఆహారం ప్యాకెట్‌లు అందాలని ఆ మేరకు ప్యాకింగ్ పూర్తి చేసి పంపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు విజయవాడ పంపేందుకు సిద్ధం చేస్తున్న పనులను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. నగరంలో ఏ1 కన్వెన్షన్, బచ్చల బాలయ్య కళ్యాణ మండపాల్లో భోజనాల తయారీ, ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించారు. స్వయంగా ఆహారాన్ని రుచి చూసి పంపిణీకి సిద్ధం చేశారు. మంగళవారం సుమారు 1 లక్ష 20 వేల ఆహారం ప్యాకెట్లను విజయవాడ పంపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డీవో సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీటీసీ సుశీల, చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం డీడీ రవికుమార్ తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో 10 వేల మందికి ఆహారం



సిద్ధం చేసిన ఆహారం, వాటర్ బాటిల్స్‌తో జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర

ఒంగోలు: విజయవాడలోని వరద బాధితులు 10 వేల మందికి ఆహారాన్ని అందించేందుకు జిల్లా విద్యాశాఖ ఆహార పొట్లాలను సిద్ధం చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర నేతృత్వంలో అధికారులు 10 వేల పులిహోర పొట్లాలు, 10 వేల వాటర్ బాటిల్స్‌ను ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు తరలించారు. కార్యక్రమంలో ఏడీ ఉదయభాస్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా కేజీ రూ.358 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 12,647 బేళ్లు రాగా 10,210 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2,437 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 147వ రోజు వేలం పాటలో 6061 బేళ్లు రాగా 5,206 వ్యాపారులు కొనుగోలు చేశారు. 855 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్టంగా రూ.190, సరాసరి రూ.315.12 వచ్చింది. కందుకూరు 1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 141వ రోజు వేలం పాటలో 6,586 బేళ్లు రాగా 5,004 బేళ్లు కొనుగోలయ్యాయి. 1,582 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.184, సరాసరి రూ.273.35 పలికింది.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లాకు 36 జాతీయ పతకాలు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023-24లో జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి మొత్తం 36 మంది జాతీయ స్థాయిలో పతకాలు అందుకున్నారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17, అండర్ 14 జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 46 విభాగాల్లో జిల్లాలోని 1400 మంది బాలబాలికలు పోటీపడ్డారని వివరించారు. అంతర్ జిల్లాల పోటీల్లో హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, ఖోఖో, కరాటేలో బంగారు పతకాలు, రగ్బీ, కబడ్డీ, సెపక్‌తక్రాలో బ్రాంజ్ మెడల్స్, ఫెన్సింగ్, జూడోలో సిల్వర్ పతకాలు లభించాయన్నారు. బాక్సింగ్‌లో సిల్వర్, పవర్‌లిఫ్టింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ జిల్లా కైవసం చేసుకుందన్నారు. అండర్ 14 విభాగంలో 16 మంది, అండర్ 17లో 20 మంది వెరసి 36 మంది జాతీయ స్థాయి పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే నేషనల్ స్కూల్ గేమ్స్ 2024-25 క్యాలెండర్ విడుదలకానుందని, విద్యార్థులు మరోమారు తమ సత్తా చాటేందుకు సాధన ముమ్మరం చేయాలని సూచించారు.

వామ్మో..మళ్లీచూద్దాం..

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వ్యక్తి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారం రోజుల కిందట తన సొంతూరులో ఇంటి నిర్మాణం చేయిద్దామని వచ్చాడు. ఇసుక కావాలని ట్రాక్టర్ యజమానులను సంప్రదించారు. కరువది నుంచి ట్రాక్టరు ఇసుక తీసుకురావడానికి రూ.10 వేలు అడిగారు. ధరలు విని విస్తుపోయిన సదరు వ్యక్తి ఇప్పుడు వద్దు పరిస్థితులు బాగా లేవు. ఇంటి నిర్మాణం తర్వాత చూద్దాం అంటూ హైదరాబాద్ వెళ్లిపోయాడు.

ఇసుక బంగారమాయే..

మద్దిపూడి మండలంలోనూ ఇసుక దొరుకుతోంది. అయితే ఇక్కడ నాణ్యత తక్కువ. ఈ ఇసుక కావాలంటే ట్రాక్టరు ధర రూ.3 వేల వరకు ఉంది. అదే నెల్లూరు జిల్లా పెన్నానది ఇసుక కావాలంటే.. ట్రాక్టరు ఇసుక రూ.8,200. ఈ లెక్కన 18 టన్నుల ఇసుక ధర రూ.36,900 అవుతోంది. బంగారంతో పోటీ పడుతోంది. కొత్తగా ఇల్లు నిర్మించుకోవాలనే వాళ్ల గుడ్లు తేలేస్తున్నారు.



ఒంగోలులో ఖాళీగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్



ఇసుక కొరతతో మార్కాపురంలో ఆగిపోయిన భవన నిర్మాణం

తమ్ముళ్లకే ఉచితం

జనానికి పంగనామం

- యార్డుల్లో నో స్టాక్
- బ్లాక్‌లో యథేచ్ఛగా విక్రయిస్తున్న టీడీపీ నేతలు
- బంగారం ధరలతో పోటీపడుతున్న ఇసుక
- జోరుగా ఇసుక అక్రమ రవాణా
- బ్లాక్‌లో టన్ను ఇసుక రూ.3 వేలకు పైమాటే
- ఇసుక కొరతతో ఆగిన నిర్మాణాలు
- జిల్లాలో భవన కార్మికులకు ఉపాధి కష్టాలు
- కొత్త పాలసీ వచ్చే వరకు లభ్యత కష్టమే అంటున్న అధికారులు

ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టుతున్న కూటమి ప్రభుత్వం.. సాక్ట్ యార్డుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టేసింది. మరో పక్క తెలుగు తమ్ముళ్లు మాత్రం ఎంత కావాలంటే.. అంత బ్లాక్ రేట్లకు అమ్ముకుంటున్నారు. వీరికి అనుమతితో పనిలేదు. నేరుగా ఇసుక రీచ్‌లో నుంచి తెచ్చి బంగారం కంటే ప్రియంగా విక్రయిస్తున్నారు. ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు రాలేదని మైనింగ్ శాఖ అధికారికంగా తవ్వకాలు నిలిపేసింది. యార్డుల్లో దొరకని ఇసుక.. తెలుగు తమ్ముళ్ల వద్ద దొరుకుతుందంటే ఇసుక దోపిడీ ఎంత విచ్చలవిడిగా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు వస్తే తప్ప కొత్త ఇసుక పాలసీ వచ్చే అవకాశం లేదు. అప్పటి వరకు ఇసుక బ్లాక్ మార్కెట్లో కావాల్సినంత దొరుకుతుంది. ఈ పరిస్థితి కారణంగా నిర్మాణ రంగం పూర్తిగా స్తంభించింది.

ఒంగోలు అర్బన్:

ఉచిత ఇసుక అంటూ కూటమి ప్రభుత్వం ప్రజల కొంపలు ముంచేసింది. భవన నిర్మాణదారులను నయవంచనకు గురి చేసింది. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు స్టాక్ పాయింట్ల వద్ద ప్రజలకు ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభిస్తున్నామంటూ ఫొటోలకు ఫోజులిచ్చినంత సేపు పట్టలేదు. అంతలోనే ఇసుక కొరత, స్టాక్ లేక రవాణా ఆగిపోయింది. గత ప్రభుత్వంలో నిల్వ ఉన్న కొద్దిపాటి ఇసుకను మాత్రమే ఉచితమని చెబుతూనే డబ్బు వసూలు చేసింది. ఆ నిల్వలు అయిపోగానే ప్రభుత్వం చేతులెత్తేసింది. ఉచిత ఇసుకను నమ్మి చేపట్టిన భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఉన్న ఇసుకను తెలుగుదేశం నేతలు తన్నుకుపోయారు. వారు చెప్పిన రేటుకు ఇసుక కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ఒంగోలు డివిజన్ పరిధిలో ఒంగోలు ఏఎంసీలో ఒకటి, జరుగుమల్లి మండలంలో రెండు కలిపి మొత్తం మూడు స్టాక్ పాయింట్‌లు ఉండగా వాటిలో ఇసుక మాత్రం అందుబాటులో లేదు. ఒక్క ఒంగోలు డివిజనే కాకుండా పశ్చిమ ప్రాంతంతో సహా జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత వేధిస్తోంది. దీంతో ఎక్కడికక్కడ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించిన తెలుగు తమ్ముళ్లు రీచ్‌ల వద్ద అనుమతులు లేకపోయినా తవ్వకాలు చేస్తూ అక్రమ రవాణాకు తెరతీశారు. బ్లాక్ మార్కెట్‌లో టన్ను ఇసుక రూ.3 వేలకు పైగానే విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక దందాకు పాల్పడుతూ టీడీపీ నేతలు జేబులు నింపుకుంటున్నా జిల్లా ఉన్నతాధికారులు, మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖలు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. నిఘా లేకపోవడంతో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. బ్లాక్ మార్కెట్లో ఇసుక రేట్లు కొండెక్కి కూర్చోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. ఇసుక దొరకదు..దొరికినా అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయలేక కూటమి ప్రభుత్వం మాటలు నమ్మి భవన నిర్మాణాలు ప్రారంభించిన వారు దిక్కుతోచని స్థితిలో మధ్యలోనే నిలిపేస్తున్నారు. కార్మిక శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 1,54,683 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది పనుల్లేక ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోతున్నారు. కొత్త పాలసీ వచ్చి అమలయ్యే వరకు జిల్లాలో ఇసుక లభ్యత కష్టమే అనేది అర్థమవుతోంది. కొత్త పాలసీ వచ్చి ఇసుక రీచ్‌లు సిద్ధం అయితే కూటమి నేతలు ఇసుక దందాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

డీడీ మైన్స్ వివరాలను ప్రెస్ రిలీజ్ చేస్తారు

ఇసుక కొరత, లభ్యత తదితర అంశాలపై తీసుకునే చర్యలపై కలెక్టర్ తమీమ్ అన్సారియాను వివరణ అడుగగా డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ ప్రతి రోజు వివరాలను ప్రెస్‌కు రిలీజ్ చేస్తారని దాటవేశారు. అయితే ఇటీవల కలెక్టర్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఇసుకను అవసరమైతే పక్క జిల్లాల నుంచి కూడా తెప్పిస్తామని తెలిపినా ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

జిల్లాలో ఇసుక లభ్యత లేదు

గత నెల 26వ తేదీ నుంచి జిల్లాలో ఇసుక లభ్యత లేకపోవడం వలన స్టాక్ వివరాలను ప్రెస్‌రిలీజ్ చేయడం లేదు. జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక లేదు. కొత్త ఇసుక పాలసీ వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుని రీచ్‌లు ఏర్పాటు చేస్తాం. అవసరమైన కొంత మంది నేరుగా నెల్లూరు జిల్లా నుంచి ఇసుకను తెప్పించుకుంటున్నారు. కొత్త ఇసుక పాలసీ అనంతరం తగిన చర్యలు తీసుకుంటాం.

– జగన్నాథం, డీడీ మైన్స్



గొట్లగట్టులో ఇసుక కొరతతో అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణం

అందనంత దూరంలో ఇసుక

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో ఇసుక డంప్‌లు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ఇసుకను గృహ నిర్మాణదారులు టన్ను రూ.1700 నుంచి రూ.1900 మధ్య కొనుగోలు చేస్తున్నారు. నెల్లూరు, కడప, తాడేపల్లి నుంచి అనధికారికంగా వస్తున్న ఇసుకను భవన నిర్మాణదారులు అధిక ధర అయినా టన్ను రూ.1700 నుంచి రూ.1900 మధ్య కొంటున్నారు. పట్టణంలోని నాలుగైదు ప్రాంతాల్లో కూటమి నాయకులు అనధికార ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసుకుని అమ్ముతున్నారు.వారు చెప్పిన ధరకే ఇసుకను కొనుగోలు చేయాల్సి వస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టన్ను రూ.1250 ఇస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ.1900 ధర పలుకుతోంది. నియోజకవర్గంలో సుమారు 300 నుంచి 400 వరకూ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. భవన నిర్మాణాలు ఆగిపోవడంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉచితం అన్నారు.. అసలే లేకుండా చేశారు

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంతంలో ఇసుక కొరత వేధిస్తోంది. కనిగిరి పట్టణంతో పాటు ఆరు మండలాల్లో ఇసుక సక్రమంగా సరఫరా లేక ఇళ్ల నిర్మాణాలు నిలిచాయి. కనిగిరి పట్టణంలో సుమారు 25 రోజుల నుంచి ఇసుక రవాణా ఆగినట్లు భవన నిర్మాణ మేస్త్రీలు తెలిపారు. గతంలో నెల్లూరు జిల్లా సోమశిల నుంచి వచ్చే కట్టుబడి ఇసుక టన్ను రూ.650 నుంచి రూ.700లకు కనిగిరిలో దింపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మొన్నటి వరకు కట్టుబడి ఇసుక టన్ను రూ.800 నుంచి రూ.850కు విక్రయించారు. అలాగే నెల్లూరు జిల్లా సంగం నుంచి ప్లాస్టరింగ్ ఇసుక రూ.900 నుంచి రూ.950 కు విక్రయిస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ప్రస్తుతం వాగులు వంకల్లో నుంచి కట్టుబడి ఇసుకను ట్రాక్టర్లలో తెచ్చుకుని ఇంటి కట్టుబడి నిర్మాణ పనులు అరకొరగా సాగిస్తున్నారు.

కొండపి : కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం సతుకుపాడు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాకు పాయింట్ ఉంది. ప్రస్తుతం స్టాకు పాయింట్లో ఇసుక నిల్వలు అయిపోయాయి. దీనికి తోడు స్టాకు పాయింట్లో గతంలో ఉన్న నిల్వ తప్ప మళ్లీ ఇసుక నిల్వ చేయకపోవటంతో అనధికారికంగా జరుగుమల్లి, కే బిట్రగుంట, చింతలపాలెం లోని ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేసేవారు. ప్రస్తుతం పత్రికల్లో వరుస కథనాలతో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. అడపాదడపా టీడీపీ సానుభూతిపరులు రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండటంతో ఇసుక ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం ఇసుక ట్రాక్టరు ధర కొన్ని మండలాల్లో రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఉండగా, మద్రిపూడిలో ట్రాక్టరు ఇసుక ధర రూ.8,200 ఉంది. ప్రస్తుతం ట్రాక్టరు ద్వారా ఇసుక రవాణాకు ఆంక్షలు తీవ్రతరం చేయడంతో టైరు బండి వెయ్యి రూపాయల చొప్పున ఇసుక రవాణా చేస్తున్నారు.

- జరుగుమల్లి మండలం పాలేరు నుంచి టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాలకు ట్రాక్టరు ఇసుక ధర రూ.4 వేలకు సరఫరా అవుతుంది.
- సింగరాయకొండ మండలంలో శానంపూడి పంచాయతీ మన్నేరు నుంచి సరఫరా చేస్తున్న ఇసుక ట్రాక్టరు ధర రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు ఉంది.
- పొన్నలూరు మండలంలో కందుకూరు మండలం వీఆర్‌కోట పంచాయతీలో మన్నేరు నుంచి సరఫరా అయ్యే ఇసుక ట్రాక్టర్ ధర రూ.5,200 ఉండగా, వేంపాడు పంచాయతీ సమీపంలో పాలేరు నుంచి సరఫరా అయ్యే ట్రాక్టరు ఇసుక ధర రూ.4 వేలు ఉంది.
- కొండపి మండలంలో నెల్లూరు జిల్లా పెన్నా నుంచి తెచ్చిన ఇసుక ట్రాక్టరు ధర రూ.4,400 ఉంది.

అనధికారిక ఇసుకే దిక్కు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలోని చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో ఇసుక నిల్వలు లేవు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఒంగోలు స్టాక్ పాయింట్ నుంచే ఇసుక రావాల్సి ఉంది. అక్కడ కూడా ఈనెల 11 వరకు ఇసుక సరఫరా నిలిపేశారు. ప్రస్తుతం చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలకు కావాల్సిన ఇసుకను అనధికారంగా అనుమతిలేని రీచ్‌ల నుంచి దొడ్డిదారిన స్థానికులతో ట్రాక్టర్‌ల ద్వారా తెప్పించుకొని ఇళ్ల పనులు చేసుకుంటున్నారు. అది కూడా ట్రాక్టర్ ఇసుక (3 యూనిట్లు) కట్టుబడికి రూ.3500, పూత పనికి రూ.4 వేలు చొప్పున అనధికారకంగా తెప్పించుకోవాల్సి వస్తుందని భవన నిర్మాణదారులు వాపోతున్నారు. మద్దిపాడు మండలంలో గుండ్లకమ్మ నది ఒడ్డునే ఉంటున్నా ఇసుక లభ్యత లేకపోగా ఒంగోలు నుంచి రూ.4 వేలు ఖర్చు చేసి ఇసుక తెచ్చుకుందామన్నా అక్కడ ఇసుక లభించకపోవడంతో ఇళ్లు, భవనాల నిర్మాణాలకు ఆటంకం కలుగుతోంది. గుండ్లకమ్మ నదిలో ఇసుక తీసుకుంటే ఇక్కడ రీచ్ లేదు కాబట్టి పోలీసులు ఎస్‌ఈబీ అధికారులు పట్టుకుంటున్నారు. ఒంగోలులో ఇసుక దొరకని పరిస్థితి. దొరికినా వేలకు వేలు పోసి కొనాల్సి వస్తోంది.

కొండెక్కిన ఇసుక ధరలు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇసుక రీచ్‌లు లేవు. అనంతపురం, కడప, నెల్లూరు, గుంటూరు, కడప ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ట్రాక్టర్ ఇసుక రూ.7400 ధర పలుకుతోంది. టన్ను ఇసుక రూ.2450 పెట్టి కొనుక్కుంటున్నారు. గతంలో టర్బో, పెద్ద లారీల్లో 40 టన్నులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం 20 టన్నులకు మించి ఇసుక లారీలకు నింపడంలేదు. దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేసరికి ఇసుక ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. ఇసుక ధర ఆకాశాన్ని తాకడంతో కొత్తగా గృహాలు కట్టుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. నిర్మాణాలు మొదలు పెట్టినవారు అరకొరగా ఇసుక వస్తుండంతో జేబులకు చిల్లులు పడుతున్నాయి. లారీ ఇసుక రూ.36 వేలు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అర్ధవీడు వంటి లోయ ప్రాంతాల్లోకి తీసుకెళ్లాలంటే ఇంకా ఎక్కువ పెట్టుకోవాలి.

ఆగిన కట్టడాల పనులు

దర్శి: దర్శి నియోజకవర్గంలో ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు కొనసాగడం లేదు. నెల్లూరు, గుంటూరు నుంచి 18 టన్నుల ఇసుక దర్శికి చేరాలంటే సుమారు రూ.30 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇది ఫ్రీ ఇసుక అని చెప్పుకుంటూ ప్రభుత్వం చేస్తున్న దోపిడీకి నిదర్శనం. అయితే ప్రస్తుతం అక్కడ అసలు ఇసుకే లేదు. నదులు పొంగి నీరు వచ్చి ఇసుక రవాణా పూర్తిగా ఆగిపోయింది. దీంతో ఇక్కడ బండి వెలిగండ్ల, ఎర్రోబనపల్లి, కృష్ణాపురం వంటి వాగుల్లో ఇసుక నాణ్యత లేకపోయినా ఆ ఇసుకను తెచ్చుకుని చిన్న చిన్న పనులు చేస్తున్నారు. ఇటువంటి దుస్థితి ఎప్పుడూ లేదని భవన నిర్మాణ కార్మికులు సైతం పనులు లేక అల్లాడి పోతున్నారు.

ఇసుక కొరతతో వీధిన పడిన భవన నిర్మాణ కార్మికులు

యర్రగొండపాలెం: ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు వీధిన పడ్డారు. పనులులేక పూట గడవడమే కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమరావతి నుంచి ఇసుక రవాణా అవుతుండటంతో టన్ను రూ.2 వేల ప్రకారం అమ్ముతున్నారు. లారీకి కేవలం 18 టన్నులు మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉంది. ఇసుక లోడింగ్ సమయంలో అనేక నిబంధనలు వర్తిస్తుండటంతో లారీ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ఒక రోజు పూర్తిగా ఇసుక రీచ్‌ల వద్దనే ఉంటున్నారు. ఈ కారణాలతో ఇసుక అధిక ధరకు రవాణా చేయాల్సి వస్తుందని వారు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఎక్కడా కనిపించడంలేదు. నాసిరకం ఇసుక కూడా టన్ను రూ.1700 ప్రకారం అమ్మకాలు జరుపుతుండటంతో నిర్మాణంలో ఉన్న భవనాలు సైతం నిలిచిపోయాయి. ఈ కారణాలతో భవన నిర్మాణాలపై ఆధారపడి బతుకులు వెళ్లదీస్తున్న కార్మికులు బతుకు దెరువు కోసం ఇతర పనులు వెతుక్కుంటున్నారు.



పుల్లలచెరువులో అర్థంతరంగా నిలిచి పోయిన భవన నిర్మాణం

ఇసుక ధరలు అధికంగా ఉన్నాయి



ఇసుక ధరలు అధికంగా ఉండటంతో పనులు సరిగ్గా ఉండటంలేదు. గత ప్రభుత్వంలో పామూరులో మామూలు ఇసుక టన్ను ధర రూ.750 దాకా ఉంటే ప్రస్తుతం రూ.850 ఉంది. అదేవిధంగా ప్లాస్టరింగ్ ఇసుక టన్ను ధర గతంలో రూ.900 ఉంటే ప్రస్తుతం రూ.1150 ఉంది. అంతేకాక ఇసుక తగినంతగా దొరక్కపోవడంతో సరిగ్గా పనులు సాగక బేల్దారి మేస్త్రీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– యం.రమణారెడ్డి, బేల్దారు మేస్త్రీ, పామూరు

మాలాంటి సామాన్యులకు ఇబ్బందే..



నేను ఇంటిలో కొద్ది రిపేర్లు చేయించుకోవడానికి ఇసుక కోసం ఒంగోలులోని ఇసుక పాయింట్‌కు వెళితే అక్కడ టన్ను ధర రూ.275 ఉంది. ట్రాక్టర్‌కు నాలుగు టన్నులు ఇసుక వస్తుంది. రూ.1100 కు ఇసుక కొనుగోలు చేసుకుంటే అక్కడ నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలించడానికి రూ.2500 ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఇంటికి చేరేసరికి మొత్తం రూ.4 వేలు అవుతోంది. అంత ఖర్చు చేసి ఇసుక కొనుగోలు చేయాలంటే మాలాంటి సామాన్యులకు చాలా ఇబ్బంది.

– అంబటి నరేంద్ర, అన్నంగి గ్రామం, మద్దిపాడు మండలం

ఇసుక లేక అవస్థలు



మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాల పరిధిలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్లాస్టరింగ్ ఇసుక అయితే ట్రాక్టర్ రూ.6 వేలకు పైగా అమ్ముతున్నారు. ఇసుక ధర ఎక్కువగా ఉండటంతో ఇంటి నిర్మాణాలు ఆగిపోయి బేల్దారి మేస్త్రీలు, కూలీలకు పనులులేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇసుక కొరతను తీర్చాలి.

– కరవర్ల డేవిడ్, బేల్దారి మేస్త్రీ, నాయుడుపేట, కొనకనమిట్ల మండలం

మూడు టన్నుల ఇసుకకు రూ.7,400 అయింది



ఏడు నెలల క్రితం ఇంటి నిర్మాణం మొదలు పెట్టినప్పుడు టన్ను ఇసుక రూ.1000 కొనుగోలు చేశాను. ఇప్పుడు మూడు టన్నుల ట్రాక్టర్ ఇసుక రూ.7400 పెట్టి కొనుగోలు చేశాను. స్లాబ్ ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన అవసరం వచ్చింది. ఉచిత ఇసుక అని ప్రచారం చేస్తున్నారు. అసలు ఇసుక దొరికే పరిస్థితి లేకుండా చేశారు.

– నడిపి బాల గురువారెడ్డి, బేస్తవారిపేట

కడుపులు మాడ్చుకొని బతుకుతున్నాం



ఇసుక కొరత వలన భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎక్కువ ధరలు పెట్టి ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తుండటంతో భవనాలు నిర్మించే యజమానులు నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్నారు. రెండు నెలల నుంచి ఇసుక తీవ్ర కొరతగా మారింది. మాపై జీవనం గడిపే కూలీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం వ్యవసాయ పనులు కూడా దొరక్కపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

– గుర్రం వెంకట సుబ్బయ్య, బేల్దారు మేస్త్రీ, యర్రగొండపాలెం

ఉచిత ఇసుక ఎక్కడ ?



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్తే ఉచితంగా ఇస్తారేమో అనుకున్నాం. తీరా చూస్తే డబ్బులు పెట్టినా కూడా ఇసుక దొరకడం లేదు. పట్టణంలో ఇసుక కొనాలంటే టన్ను రూ.1800 నుంచి రూ.1900 ఏరోజుకారోజు ధరను నిర్ణయిస్తూ అమ్ముతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకను అందించాలి

– బి.సుబ్బయ్య, రాడ్‌బెండింగ్ మేస్త్రీ, మార్కాపురం.

క్లుప్తంగా

జంపలేరు ఉధృతితో కోతకు గురైన రోడ్డు



ఒకవైపు పూర్తిగా కోతకు గురైన తారురోడ్డు

అర్ధవీడు(బేస్తవారిపేట): అర్ధవీడు మండలంలోని పెద్ద కందుకూరు సమీపంలో జంపలేరు వాగు గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించడంతో రహదారి భారీగా కోతకు గురైంది. వాగుపై నిర్మించిన చప్టా వద్ద ఒకవైపున రోడ్డు పూర్తిగా కోతకు గురి కావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్ద కందుకూరు, శంకరాపురం గ్రామాల్లోని ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వారం రోజులుగా విద్యుత్ బంద్

- సమస్య పరిష్కరించాలని రైతుల మొర



పొదిలి సబ్‌స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న రైతులు

పొదిలి రూరల్: పొదిలి మండలం ఆముదాలపల్లి పంచాయతీలోని రాములవీడు గ్రామంలో పొలాలకు గత వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికంగా రైల్వే లైన్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వారం రోజులైనా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో పొలాల్లో పంటలు ఎండు ముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినావిద్యుత్ శాఖ అధికరారు నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం దాదాపు 15 మంది రైతులు పొదిలి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి సమస్య తీవ్రతను వివరించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ అంకబాబు మాట్లాడుతూ.. రాములవీడు వద్ద అండర్ గ్రాండ్ కేబుల్ దెబ్బతినడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.



2018లో మేతబీడు సర్వే నెం 347/9ను ఆన్‌లైన్ చేసినట్టు చూపుతున్న మ్యుటేషన్ రికార్డు



కలుజువ్వలపాడులో సర్వే నంబర్ 347/9లోని మేత బీడులో ప్లాట్లు వేసిన కబ్జారాయుడు

మేత బీడు కొట్టేశారు!

'సంపద సృష్టి'లో పచ్చ తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. అధికారమే అండగా జేబులు నింపుకొనేందుకు అక్రమాలకు తెగబడుతున్నారు. పశువుల బీడు భూములపై గత టీడీపీ హయాంలోనే విఫలయత్నం చేసిన పచ్చ తమ్ముళ్లు.. కూటమి ప్రభుత్వంలో మరోమారు అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేశారంటే వీరి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులను లోబరుచుకుని తమ అక్రమ దందాకు మార్గం సుగమం చేసుకుని వందల ఎకరాల భూములను తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. కబ్జా చేసిన భూములను యథేచ్ఛగా విక్రయిస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు మౌనం దాల్చడం విమర్శలకు తావిస్తోంది.

- తర్లుపాడు మండలంలో 200 ఎకరాల పశువుల బీడు కబ్జాకు పచ్చ నేతల పన్నాగం
- కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్
- మేతబీడుగా పేర్కొన్న వివరాలు రుద్ది తమ పేర్లు రానుకున్న పచ్చ తమ్ముళ్లు
- పోరంబోకుల దందాకు కలెక్టరేట్ స్థాయిలో అధికారుల వత్తాసుపై ప్రజల విస్మయం
- యథేచ్ఛగా విక్రయిస్తున్నా చోద్యం చూస్తున్న స్థానిక రెవెన్యూ అధికారులు



జంగంరెడ్డి కాలనీలోని మేతబీడు భూమిలో జేసీబీ సాయంతో చెట్లు తొలగిస్తున్న దృశ్యం

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, జంగంరెడ్డి కాలనీల్లో భూ అక్రమార్కులు బరితెగిస్తున్నారు. గ్రామాల్లోని పశువుల మేత కోసం దశాబ్దాల క్రితం కేటాయించిన వందల ఎకరాల భూములను కాజేసేందుకు కొందరు పోరంబోకులు సిద్ధమయ్యారు. జాతీయ రహదారి సమీపంలోనే ఈ విలువైన భూములు ఉండటంతో ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధాన రహదారి సమీపంలోనే ఉండటంతో ఎకరా భూమి రూ.20 నుంచి రూ.25 లక్షలు పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన పచ్చ చొక్కాలు వందల ఎకరాలు అక్రమంగా సొంతం చేసుకునేందుకు అక్రమాలకు తెగబడుతున్నారు.



ఎఫ్‌ఎల్‌ఆర్ రికార్డులో మేతబీడు స్థానంలో తమ పేర్లు రాసుకున్న అక్రమార్కులు

ఎఫ్‌ఎల్‌ఆర్ రుద్ది..

మండలంలోని కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, జంగం రెడ్డికాలనీలకు సంబంధించిన ఎఫ్‌ఎల్‌ఆర్ రికార్డును అక్రమార్కులు ట్యాంపర్ చేశారు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డుల్లో మేతబీడు భూమి అనే పదాన్ని కొట్టివేసి తమ పేర్లు రాసుకున్నారు. ఎఫ్‌ఎల్‌ఆర్ ట్యాంపర్ చేయడం వెనుక రెవెన్యూ అధికారుల హస్తంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పాత్ర లేకపోతే ఇంతటి దారుణానికి అక్రమార్కులు ఒడిగట్టలేరని వారు ఆరోపిస్తున్నారు.

పచ్చ తమ్ముళ్ల వక్ర బుద్ధి

రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌కు పచ్చ తమ్ముళ్లు ఎంచుకున్న మార్గం బట్టబయలైంది. తొలుత రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించాలని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. అక్కడి సిబ్బందిని మభ్యపెట్టి, కాసుల ఆశ చూపి మేతబీడు భూములను రౌండప్ చేసి హక్కుదారులుగా తమ పేర్లు రాసుకున్నారు. ఆ విధంగా ట్యాంపర్ చేసిన రికార్డులను సమాచార హక్కు చట్టం ద్వారానే పొంది, అధికారికంగా ఆన్‌లైన్ చేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేశారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న విషయాన్ని గమనించిన సదరు తహసీల్దార్లు ఆన్‌లైన్ చేయకపోతే ఏకంగా న్యాయస్థానాలను ఆశ్రయించారు.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



కలుజువ్వలపాడు పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో సర్వే నంబర్లు 8/1, 8/2, 8/3, 8/4, 8/5, 9, 11/1, 11/2, 11/3, 49/1, 49/2, 65/1, 65/2, 65/3, 10/2, 13/8, 45, 51/1లో పశువుల మేతబీడు భూములు, కలుజువ్వలపాడు సచివాలయం పక్కన ఉన్న 347/9 సర్వే నంబర్‌లో భూముల రికార్డులు ట్యాంపర్ చేశారు. అక్రమంగా కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ గతంలోనే కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాం. అధికారులు చర్యలు తీసుకోలేదు. పంచాయతీ పరిధిలో సుమారు 3 వేలకు పైగా గేదెలు ఉన్నాయి. పశువుల మేతకు ఆ భూములే ఆధారం. వాటిని కాపాడాలని మరోమారు కోరుతున్నాం.

– శిఖామణి, కలుజువ్వలపాడు సర్పంచ్

మేతబీడును విక్రయించేందుకు బేరం

కలుజువ్వలపాడు పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిపై సర్వే నంబర్ 347/9లో 1.24 ఎకరాల పశువుల మేతబీడు భూమిని 2018లో తన పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్న టీడీపీ చోటా నాయకుడు ప్లాట్లుగా వేసి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. గ్రామ సచివాలయ భవనాన్ని ఆనుకుని ఉన్న ఈ విలువైన భూమిని యథేచ్ఛగా బేరానికి పెట్టినా స్థానిక రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. అక్రమ బాగోతంపై నోరు మెదపకుండా ఉండేందుకు రెవెన్యూ సిబ్బందికి సైతం వాటా ఇచ్చేందుకు సదరు అక్రమార్కుడు ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి పశువుల మేత బీడును అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, జంగంరెడ్డి కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు(దర్శి): పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన తాళ్లూరు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కైపు వెంకటేశ్వరరెడ్డి(60) అనే రైతు తన పొలంలో గడ్డి కోసుకుని వచ్చేందుకు వెళ్లాడు. కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించడం లేదని గట్టు వెంట చెలకపారతో చెక్కుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైరు తగిలి అచేతన స్థితిలో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆయనను తాళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



కైపు వెంకటేశ్వరరెడ్డి(ఫైల్)

కొత్తపాలెంలో వెంకటేశ్వరరెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తూము వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనా రెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరిముల్లా, రజానగరం సర్పంచ్ ఎస్‌కే వలి, నాయకులు ఐవీ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కైపు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



డీపీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

- డీపీఓ సిబ్బందికి ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచన

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని, ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ అయ్యేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో వివిధ విభాగాలైన డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, పరిపాలనా విభాగంలోని ఏబీపీ సెక్షన్లు, అడిషనల్ ఎస్పీల కార్యాలయాలు, డీపీఓ స్టోర్ మేనేజ్ సిస్టం రూం, సర్వీస్ బుక్ రూం, ఇన్వార్డ్, అవుట్ వార్డ్, రికార్డు రూంలను పరిశీలించి ఆయా విభాగాల పనితీరును పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయం మరమ్మతులు, నవీకరణ చర్యలకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఏసీఆర్బీ, ఎస్సీఆర్బీ, హ్యూమన్ రైట్స్, ఎస్సీ ఎస్టీ కమిషన్, ఇతర కమిషన్ల నుంచి వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) నాగేశ్వరరావు, డీపీఓ ఏఓ సులోచన, డీసీఆర్బీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఏఏఓ ఉస్మాన్ బాషా, యాస్మిన్ బాను ఉన్నారు.

ఒక్కరి నేత్రదానంతో నలుగురికి చూపు



నేత్రదాన పక్షోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి నళిని

ఒంగోలు టౌన్: మరణాంతరం ఒకరు నేత్రదానం చేస్తే నలుగురికి చూపునివ్వవచ్చని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. నేత్రదాతల సౌకర్యం కోసం జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో కార్నియా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సక్షం భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. తొలుత అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జి.అర్చన మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని, నేత్ర, అవయవ, శరీరదాన దాతలుగా ప్రజలు స్వచ్ఛందంగా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలు నేత్ర దాతలై అంధుల జీవితాలకు వెలుగులివ్వాలని, దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అవయవ దాతల ఐక్య వేదిక కన్వీనర్ జి.నాగేశ్వరరావు, ఐక్య వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి వెంకటేశ్వర్లు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు, ఎంవీ రమణయ్య, మర్రిపూడి ఏడుకొండలు పాల్గొన్నారు.

నేత్ర దానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

అనునిత్యం ప్రజలతో మమేకమయ్యే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నేత్రదానంపై అవగాహన పెంపొందించాలని అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నళిని సూచించారు. నేత్ర దాన పక్షోత్సావాలను పురస్కరించుకొని మంగళవారం పాపా కాలనీ అర్బన్ వైద్యశాలలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన దేశంలో ఏటా 1.20 లక్షల కార్నియాలు అవసరమని, అయితే కేవలం 20 వేల కార్నియాలు మాత్రమే లభ్యమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో నేత్ర దానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రంగకుమార్ యాదవ్, ఆప్తమాలజీ అధికారులు షేక్ అబ్దుల్ రవూఫ్, ఎం. శ్రీనివాసరావు, ఎన్.వెంకటేశ్వర్లు, అర్బన్ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

భర్తను హత్యచేసిన భార్యకు జీవిత ఖైదు

తిరుపతి లీగల్: భర్త వేధింపులు భరించలేక అతనిని హత్య చేసి అతని తలను పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చిన సంచలన కేసులో రేణిగుంట, బుగ్గ వీధి ఎక్స్‌టెన్షన్‌కు చెందిన శ్రీ భాష్యం వసుంధరకు జీవిత ఖైదు, వేయి రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన మంగళవారం తీర్పు చెప్పారు. రేణిగుంట సీఐ శరత్ చంద్ర, కోర్టు మానిటరింగ్ అధికారి రామకృష్ణారెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు వెంకటేష్, హేమంత్ కుమార్ తెలిపిన కేసులోని వివరాల మేరకు 2022 జనవరి 20వ తేదీ రేణిగుంట పోలీస్ స్టేషన్‌కు నిందితురాలు వసుంధర వచ్చారు. తాను తన భర్త ఎస్.రవిచంద్ర ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి వ్యాపార రీత్యా రేణిగుంటకు వచ్చినట్టు తెలిపారు. తనకు మానసిక వైకల్యంతో ఉన్న ఓ కుమారుడు ఉన్నాడనీ, తన భర్త రవిచంద్ర అనేక వ్యాపారాలు చేసి నష్టపోయాడన్నారు. అతను ఇతర మహిళలతో వివాహేత సంబంధాలు పెట్టుకుంటూ, ఇంట్లో తనను మానసికంగా వేధించేవాడని పోలీసులకు తెలిపారు. అతను కుటుంబ సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిత్యం తనను వేధిస్తూ ఉండడంతో ఇంట్లో ఉన్న తన భర్త రవిచంద్రను కత్తితో మెడ దగ్గర తీవ్రంగా పొడిచి హత్య చేసినట్టు ఆమె పోలీసుల ఎదుట నేరం అంగీకరించారు. తన భర్త తలను నరికి ఓ ప్లాస్టిక్ కవర్లో తీసుకొచ్చినట్టు పోలీసులకు అతని తలను చూపించారు. దీనిపై రేణిగుంట పోలీస్ కానిస్టేబుల్ జి.మునస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి రేణిగుంట స్టేషన్ సీఐ అంజూయాదవ్ కేసు దర్యాప్తు చేసి నిందితురాలు వసుంధరను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వసుంధరకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ విజయలక్ష్మి వాదించారు.



నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యుత్ కాంతుల్లో ఇడుపూరు లేఔట్

వెలుగులు మాయం.. 'చీకటి' కోణం

''వైఎస్ జగన్ పేరు ఎక్కడా వినిపించకూడదు.. వైఎస్సార్ సీపీ హయాం నాటి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల జాడ అస్సలు కనిపించకూడదు'' ఇదీ కూటమి ప్రభుత్వ పెద్దలు 3 నెలలుగా జపిస్తున్న దుర్నీతి మంత్రం. సచివాలయాలపై దాడులు, శిలాఫలకాల ధ్వంసాలు అందులో భాగమే. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా పాలన గాడిలో పడలేదు సరికదా సమస్యలపై మొత్తుకుంటున్నా పాలకుల నుంచి స్పందన లేదు. మార్కాపురం పట్టణంలోని అర్హులైన పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇడుపూరు లేఔట్‌లో 6664 భవనాలు మంజూరు చేశారు. 1832 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో విద్యుత్ కాంతులతో వెలుగులీనిన జగనన్న కాలనీ నేడు అంధకారంలో మగ్గుతోంది. కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– మార్కాపురం



నేడు కూటమి ప్రభుత్వంలో అంధకారంలో..

పేలుతున్న ఉల్లి

- లోకల్ మార్కెట్‌లో కేజీ ఉల్లిపాయల ధర రూ.60
- కేజీ రూ.80 పలుకుతున్న నాందేడ్ ఉల్లి



మార్కాపురం: ఉల్లిపాయలు కోయకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి.! దడ పుట్టించే ధరలతో ఉల్లి కొండెక్కి కూర్చుంది. గత ఆగస్టు 15 నాటికి మార్కెట్‌లో కేజీ ఉల్లిపాయలు 40 రూపాయలు ఉండగా 15 రోజుల వ్యవధిలో మరో 20 రూపాయలు పెరిగింది. దిగుబడి తగ్గడం, వర్షాల నేపథ్యంలో ఉల్లి పంట మార్కెట్‌లోకి రాకపోవడంతో ఇదే అదనుగా వ్యాపారులు ధర పెంచేశారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనే సామెత ఉంది. ప్రతి వంటలో ఉల్లిపాయ వాడకం తప్పనిసరి. అది శాఖహారమైనా, మాంసాహారమైనా సరే ఉల్లిపాయ లేకుండా కష్టం. శరీరంలో వ్యాధి నిరోధకశక్తి పెంచడంలో ఉల్లిపాయది ప్రధానపాత్ర. అయితే ఈ ఏడాది ఉల్లి సాగు చేశాక సరైన వర్షాలు లేకపోవడంతో పంట దెబ్బతింది. ప్రయాసకోర్చి సాగు చేసిన ఉల్లి పంట ఇటీవల కురిసిన వర్షాలతో నష్టం కలిగింది. రాష్ట్రంతోపాటు మహారాష్ట్రలోనూ వర్షాలు పడటంతో ఆశించిన స్థాయిలో మార్కెట్‌కు పంట ఉత్పత్తి చేరలేదు. ప్రస్తుతం మహారాష్ట్రలోని నాందేడ్, ఇతర ప్రాంతాల నుంచి నుంచి ఉల్లిపాయలు దిగుమతి చేసుకుంటున్నారు. డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా లేకపోవడంతో గత వారం రోజుల నుంచి ధర పెరుగుతోంది. తెల్ల ఉల్లిగడ్డల ధర కేజీ రూ.80 వరకు పలుకుతోంది. మార్కాపురం మార్కెట్‌కు ప్రస్తుతం కర్నూలు, నంద్యాలతోపాటు మహారాష్ట్ర నుంచి ఉల్లి గడ్డలు దిగుమతి అవుతున్నాయి. గతంలో మార్కాపురం, చుట్టు పక్కల గ్రామాలైన పెద్దారవీడు, దేవరాజుగట్టు, కొత్తపల్లి, బద్వీడు చెర్లోపల్లె తదితర గ్రామాల్లో ఉల్లి సాగు చేసేవారు. అప్పుడు కిలో రూ.20 నుంచి రూ.30 మధ్య విక్రయించేవారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఉల్లి సాగు కాలేదు. హోల్‌సేల్ మార్కెట్‌లోనే కేజీ రూ.55కు విక్రయిస్తుండటంతో.. కిరాణా వ్యాపారులు 60 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.